తాగునీటి ఇబ్బందులు తలెత్తనీయొద్దు

● నారాయణపేట కలెక్టర్ సిక్తాపట్నాయక్

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తాపట్నాయక్

నారాయణపేట టౌన్, ఫిబ్రవరి 27: రానున్న వేసవిలో జిల్లాలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సిక్తాపట్నాయక్ అన్నారు. గురువారం పట్టణంలోని కలెక్టరేట్‌లో మిషన్ భగీరథ, బడ్జెట్, పన్నుల వసూలుపై అధికారులతో సమీక్ష నిర్వహించి మాట్లాడారు. మిషన్ భగీరథ నీటి సరఫరాలో ఏవైనా ఇబ్బందులుంటే తెలపాలన్నారు. వేసవిలో యాక్షన్ ప్లాన్ ప్రకారం ముందుకెళ్లాలన్నారు. రంజాన్ మాసం ప్రారంభమున్నవేపథ్యంలో సౌకర్యాల కల్పనపై దృష్టిసారించాలన్నారు. పట్టణాలు, మండల కేంద్రాలు, గ్రామాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా మౌలిక వసతులు కల్పించాలన్నారు. తాగునీరు, పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. వీధిదీపాలకు మరమ్మతులు చేపట్టాలని, ప్రార్థనా సమయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చూడాలన్నారు. ఈద్గాలు, మసీదుల వద్ద పారిశుధ్య సమస్య లేకుండా చూడాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ బెన్ షాలం, డీఎస్పీ లింగయ్య, ఆర్డీవో రాంచందర్, మైనార్టీ అధికారి రషీద్ పాల్గొన్నారు.

సహనంతో కూడిన జీవన విధానం అవసరం

శాంతి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ జానకి

● పాలమూరు ఎస్పీ జానకి

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 27: సమాజంలో శాంతి, సామరస్యం, సహనంతో కూడిన జీవన విధానం అవసరమని ఎస్పీ జానకి పేర్కొన్నారు. గురువారం రాత్రి జిల్లా కేంద్రంలో శాంతిక మిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. రాబోయే పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. వివిధ మతాల ప్రతినిధులను ఒకే వేదికపైకి తీసుకొచ్చి జిల్లాలో శాంతి, భద్రత, సహనాన్ని పెంపొందించడం, మతపర మైన కలహాలను నివారించేందుకు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సంఘటనలు ఎదురైనప్పుడు సామరస్యంగా పరిష్కరించేందుకు పోలీసుల సహకారాన్ని కోరాలన్నారు. శాంతియుత వాతావరణాన్ని కాపాడేందుకు ప్రతిమత పెద్దతన అనుచరులకు సహనంతో ప్రవర్తించేలా ప్రేరేపించాలని పేర్కొన్నారు. సమావేశంలో ఏఎస్పీ రాములు, డీఎస్పీ వెంకటేశ్వర్లు, వన్‌టౌన్ సీఐ అప్పయ్య, టుటౌన్ సీఐ ఎజాజుద్దీన్, రూరల్ సీఐ గాంధీ నాయక్, ట్రాఫిక్ సీఐ భగవంత్ రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ సీఐ వెంకటేశ్, ఇతర పోలీసు అధికారులు, హిందు, ముస్లిం మతపెద్దలు, ప్రజా సంఘాల నాయకులు హాజరయ్యారు.

పాఠశాల పరిసరాలను శుభ్రంగా ఉంచాలి

● అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్ ● బాదేపల్లి ఉన్నత పాఠశాల సందర్శన

అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్

జడ్చర్ల, ఫిబ్రవరి 27: జడ్చర్ల మున్సిపాలిటీలోని బాదేపల్లి ఉన్నత పాఠశాలను గురువారం అదనపు కలెక్టర్ శివేంద్రప్ర తాప్ సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలోగల టాయిలెట్స్, పారిశుధ్యాన్ని పరిశీలించారు. అనంతరం తరగతి గదిలో కూర్చుని విద్యార్థుల విద్యాప్రమాణాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ఆవరణను పరిశుభ్రంగా ఉంచాలని టాయిలెట్స్ నీట్‌గా ఉంచాలని సూచించారు. విద్యార్థులకు ఎల్లా అసౌకర్యాలు కలగకుండా చూడాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో మంజూలాదేవి, హెచ్‌ఎం చంద్రకళ, ఎంపీడీవో విజయకుమార్, కమిషనర్ లక్ష్మారెడ్డి తదితరులు ఉన్నారు.

పబ్లిసిటీ సెంటర్ పరిశీలన

జడ్చర్ల మున్సిపాలిటీలోని జయప్రకాశ్‌నగర్‌లో నిర్మించిన యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్(ఏబీసీ)ని పరిశీలించారు. త్వరగా ఏబీసీ సెంటర్‌ను అందుబాటులోకి తీసుకురావాలని, సోమవారం నుంచి కుక్కలకు సంబంధించిన జంతు జనన నియంత్రణ చర్యలు చేపట్టాలని పూచించారు. వీధికుక్కల నియంత్రణ వెంటనే ఆపరేషన్‌తో నియంత్రణ చర్యలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పుష్పలత, కౌన్సిలర్లు, సతీశ్, ఉమాదేవివెంకటేశ్, సానిటరి ఇన్‌స్పెక్టర్, సీనియర్ అసిస్టెంట్ తదితరులు ఉన్నారు.

ప్రతికార్యకర్తకూ అండగా ఉంటాం

రాచాలలో బాధితడిని పరామర్శిస్తున్న రాజశేఖర్‌రెడ్డి

మూసాపేట(అడ్డాకుల), ఫిబ్రవరి 27: బీఆర్ఎస్ పార్టీ ప్రతికార్యకర్తకు అండగా ఉంటుందని అడ్డాకుల మాజీ జెడ్పీటీసీ నల్లమద్ది రాజశేఖర్ రెడ్డి అన్నారు. మండలంలోని రాచాలలోని దండు ఆంజనేయులు వ్యవసాయ పొలంలో వరిపంటకు డ్రోన్‌తో పిచికారీ చేస్తుండగా గాయపడి ఆరోగ్య పరిస్థితిని ఆరా తీసి ఆర్థికసాయం అందజేశారు. అదేవిధంగా చేగుంట ఆనందం ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తుండగా.. ప్రమాదం జరిగి గాయపడి చికిత్స పొందుతున్నాడు. దీంతో విషయం తెలిసి రాజశేఖర్‌రెడ్డి గురువారం అతని ఇంటికెళ్లి పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్యకర్తలు అందరూ కలిసి ఉండాలని, ఒకరి కొకరు సాయం చేసుకోవాలని సూచించారు. కార్యకర్తల సమిష్టిగా ఉంటనే పార్టీ బలంగా ఉంటుందని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు చక్రపాణిరెడ్డి, గంగిరెడ్డి, రాజుగౌడ్, రామకృష్ణ, చెన్నకేశవులు, రాము, కొండన్న తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

● కలెక్టర్ విజయేందిరబోయి

మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిరబోయి

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, ఫిబ్రవరి 27: మార్చి 5నుంచి 25 వరకు నిర్వహించనున్న ఇంటర్మీడియట్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ విజయేందిర బోయి అధికారులకు సూచించారు. గురువారం ఆమె కలెక్టరేట్‌లో పరీక్షల ఏర్పాట్లు, నిర్వహణ అంశాలపై సమావేశం నిర్వహించారు. ఎలాంటి తప్పులకు ఆస్కారం లేకుండా పరీక్షలు నిర్వహించాలన్నారు. ప్రతిరోజూ పరీక్ష ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు జరగనున్నాయని తెలిపారు. జిల్లాలో మొత్తం 22,483 మంది విద్యార్థులు ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాయనున్నారని ఇందుకుగాను 36 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించాలని, జిరాక్స్ సెంటర్లను మూసి వేయాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్, తాగునీటి సౌకర్యం, ఫర్నీచర్, ఫ్యాన్లు ఏర్పాటు చేయాలన్నారు. విద్యా, వైద్య, పోలీసు, రెవెన్యూ, పీఆర్, మున్సిపాలిటీ శాఖల వారీగా కేటాయించిన పనులను వందశాతం పూర్తి చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, అదనపు ఎస్పీ రాములు, ఆర్డీవో నవీన్, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి, డీపీవో పార్థసారథి, డీఈవో ప్రవీణ్‌కుమార్, డీఐఈవో కౌసర్‌జహాన్ తదితరులు పాల్గొన్నారు.

హనుమంత్‌రావు టెక్నాలజీతో శాశ్వత పరిష్కారం

● ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే పర్ణికారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎస్.ఆర్ రెడ్డి
● మూడు పంటలకు సాగునీరు లభ్యతపై అవగాహన సదస్సు

మాట్లాడుతున్న ఎంపీ డీకే అరుణ, చిత్రంలో ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

నారాయణ పేట, ఫిబ్రవరి 27: హనుమంత్‌రావు టెక్నాలజీతో శాశ్వత పరిష్కారం దొరుకుతుందని ఎంపీ డీకే అరుణ పేర్కొన్నారు. నీటి భద్రతకు సంబంధించిన అంశాలకు తోడు, నారాయణపేట జిల్లా అంతటా ఏడాదిలో 3పంటలకు నీరందించాలన్న హనుమంతరావు టెక్నాలజీ అమలుతో కలిగే లాభాలపై మర్రి చెన్నారెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం పేటలోని స్కిల్ సెంటర్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే పర్ణికారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి, ప్రముఖ పర్యావరణవేత్త ప్రొఫెసర్ పురుషోత్తంరెడ్డి, విద్యావేత్తలు, నిపుణులు, అధికారులు, రైతులు, రాజకీయ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ డీకే అరుణ మాట్లాడుతూ.. నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకంపై రైతుల్లో అనుమానాలున్నాని, వాటిని నివృత్తి చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. ఎమ్మెల్యే పర్ణికారెడ్డి మాట్లాడుతూ.. నారాయణపేట ప్రాంతంలో ఫ్లైలెట్ ప్రాజెక్టును ఎంపిక చేయడం అభినందనీయమన్నారు. ఈ ప్రాజెక్టుకు తనవంతు సహాయ, సహకారాలు అందిస్తామన్నారు. మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. రైతులపై భారం పడకుండా ప్రాజెక్టు చేపట్టాలని కోరారు. నారాయణపేట ప్రాంతంలో నాలుగు పంటలను పండించే ప్రణాళిక కోసం ఈ ప్రాజెక్టు ఏర్పాటుకు ముందుకురావడం అభినందనీయమన్నారు.

మర్రి చెన్నా రెడ్డి ట్రస్ట్ కార్యదర్శి మర్రి శశిధర్ రెడ్డి మాట్లాడుతూ.. నారాయణపేట జిల్లాలో దాదాపు 4,96,779 ఎకరాల సాగు భూమి ఉందని, వర్షాధార ప్రాంతం 2,38,783 ఎకరాలు కాగా, భూగర్భజలాలపై ఆధారపడి 1,39,956 ఎకరాలు ఉన్నాయన్నారు. వర్షాధార, భూగర్భజలాలపై ఆధారపడిన 3,78,739 ఎకరాలపై దృష్టిపెట్టే అవసరముందని, 21,520 ఎకరాలు ట్యాంకుల కింద ఉన్నాయని, 13,281 ఎకరాలు ప్రాజెక్టు కాల్వల కింద ఉన్నాయన్నారు. కృష్ణానదిలో నీటి లభ్యత సమస్యగా ఉంటుందని, ఇతర ఉపరితల ప్రవాహంపై ఆధారపడి ఉన్న 11,663ఎకరాల పరిస్థితి వాతావరణ మార్పులతో అస్థిరంగా ఉంటుందన్నారు. హనుమంతరావు టెక్నాలజీ చతుర్విధ జల ప్రక్రియ జిల్లా ప్రజల జీవితాలను మార్చగలదన్నారు. ఎకరానికి దాదాపు రూ.15వేల ఖర్చుతో దాదాపు 3లక్షల ఎకరాల్లో దీనిని అమలు చేయడానికి మొత్తం రూ.450కోట్లు అవసరమవుతుందన్నారు.

ఇసుక డంపుల సీజ్

దేవరకద్ర, ఫిబ్రవరి 27: మండలంలోని వాగుల నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారని ''నమస్తే తెలంగాణ దినపత్రి''లో గురువారం ప్రచురితమైన 'పట్టపగలే తోడేస్తున్నారు' కథనానికి అధికారులు స్పందించారు. మండలంలోని ఎక్కడెక్కడ డంపులు ఉన్నాయని, ఇసుక రవాణా ఏ వాగుల నుంచి తరలిస్తున్నారని ఆరా తీశారు. పెద్దగోప్లాపూర్ శివారులో ఇసుకను అక్రమంగా తరలించి డంపు చేసినట్లు అధికారులు గుర్తించారు. ఆ డంపును బండర్‌పల్లికి చెందిన ఆంజనేయులు గ్రామ శివారులోని వాగునుంచి ఇసుకను తరలించి డంపు చేసినట్లు తెలిసి ఎస్సై నాగన్న, ఆర్ఐ శరత్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది కలిసి ఇసుక డంపులను సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై నాగన్న మాట్లాడుతూ.. ఇసుక అక్రమ రవాణా చేసే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బాలికను తల్లిని చేసిన యువకుడిపై కేసు నమోదు

మద్దూర్ (కొత్తపల్లి)ఫిబ్రవరి27:మద్దూర్ మండలంలోని ఓతండాకు చెందిన బాలికను తల్లిని చేసిన అదేతండాకు చెందిన అనిల్‌నాయక్‌పై గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై విజయ్ కుమార్ తెలిపారు. బతుకుదెరువు కోసం బాలిక తల్లిదండ్రులు ముంబైకి వలస వెళ్లారు. నాన్నమ్మ వద్ద ఉంటూ మద్దూర్ జెడ్పీహెచ్ఎస్‌లో చదువుతున్న బాలికను మాయమాటలతో లోబరుచుకొని గర్భిణిని చేయగా.. చివరకు బుధవారం రాత్రి మద్దూరు దవాఖానలో పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. ఈ ఘటనపై బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ, ఫిబ్రవరి 27: పదో తరగతి వార్షిక పరీక్షల్లో పాలమూరు విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని మహబూబ్‌నగర్ ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్ అన్నారు. గురువారం ఎనుగొండ ఉన్నత పాఠశాల, మహబూబ్‌నగర్ పట్టణం, అప్పన్నపల్లి, ఎదిర ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి విద్యార్థులకు 2డీ, 3డీ యానిమేటెడ్ డిజిటల్ కంటెంట్ స్టడీ మెటీరియల్స్‌ను అందజేశారు. విద్యాశాఖ సీఎంవో బాలు యాదవ్ మాట్లాడుతూ.. గతేడాది కంటే మెరుగైన ఫలితాలు సాధిస్తామని.. ఆ దిశగా ఇప్పటికే విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రణాళికలు రూపొందించి ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. కార్యక్రమాల్లో మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంకుమార్ గౌడ్ డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరా జ్యోతి, హెచ్‌ఎం అరుణకుమారి, నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాలభవన్‌గా అప్‌గ్రేడ్ చేయాలి

నారాయణపేట టౌన్, ఫిబ్రవరి 27: జిల్లా కేంద్రంలోని బాలకేంద్రాన్ని బాల భవన్‌గా అప్‌గ్రేడ్ చేయాలని బాలకేంద్రం సూపరింటెండెంట్ మహిపాల్ రెడ్డి కోరారు. గురువారం బాల కేంద్రం సిబ్బందితో కలిసి ఎంపీ డీకే అరుణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 40ఏండ్లుగా చిన్నారులకు వివిధ కళాంశాలలో శిక్షణ అందిస్తున్న బాలకేంద్రంలో సిబ్బంది అతి తక్కువ వేతనాలతో పని చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో బాలకేంద్రం సిబ్బంది నర్సింహులు, వసంతకుమార్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక

కృష్ణ, ఫిబ్రవరి 27 : షూటింగ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 7న హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి సీనియర్ షూటింగ్ బాల్ ఎంపికలో కృష్ణ మండలం ముడుమాల గ్రామానికి చెందిన పరశురాములు పాల్గొని క్రీడా ప్రతిభను చాటి జాతీయస్థాయి సీనియర్ షూటింగ్ పోటీలకు ఎంపికైనట్లు షూటింగ్ బాల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోపాలం ద్వారా సమాచారం అందినట్లు పరశురాం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన పరశురాములు ఈనెల 28 నుంచి మార్చి 3వ తేదీ వరకు నల్గొండ జిల్లా కేంద్రంలో నిర్వహించే జాతీయ స్థాయి షూటింగ్ బాల్ క్రీడల్లో పాల్గొనున్నట్లు పేర్కొన్నారు. అలాగే ఈనెల 9వ తేదీన మక్తల్‌లో జరిగిన 10 పది కిలోమీటర్ల మౌంటెన్ సైక్లింగ్ పోటీల్లో పాల్గొని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎన్నికైనట్లు పరశురాములు తెలిపారు. మార్చి 7 నుంచి 9వ తేదీ వరకు హైదరాబాద్ బాచ్‌లో జరిగే రాష్ట్ర స్థాయి క్రీడల్లో పాల్గొంటున్నట్లు పేర్కొన్నారు.

విజ్జీ క్రికెట్ ట్రోఫీకి ఎంపీఎస్ విద్యార్థి..

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, ఫిబ్రవరి 27: బీసీసీఐ ఆధ్వర్యంలో మార్చి 10వ తేదీ నుంచి త్రిపుర రాష్ట్రంలో నిర్వహించే విజ్జీ క్రికెట్ ట్రోఫీకి ఎంపీఎస్ కళాశాల విద్యార్థి డేవిడ్ క్రిపాల్‌రాయ్ ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా గురువారం ప్రిన్సిపాల్ పద్మావతి, ఫిజికల్ డైరెక్టర్ సత్యభాస్కర్ రెడ్డి, బోధన, బోధనేతర సిబ్బంది విద్యార్థిని సన్మానించారు. ఇంటర్ యూనివర్సిటీ సౌత్‌జోన్ పోటీల్లో బెస్ట్ ఆల్‌రౌండర్‌గా అత్యుత్తమ ప్రతిభ కనబర్చడం, ఆల్ ఇండియా స్థాయిలో 6వ స్థానం సాధించడంతో ఈ అరుదైన అవకాశం లభించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఆల్‌ఇండియా క్రికెట్ పోటీలకు వెళ్తున్న క్రీడాకారుడి రవాణా, ఇతర ఖర్చులకు కళాశాల స్టాఫ్ క్లబ్ తరఫున రూ.6500లు, ఫిజికల్ డైరెక్టర్ సత్యభాస్కర్‌రెడ్డి రూ.6500 ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

క్రీడాకారులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

క్రీడాకారుడిని సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, పీడీ

చలివేంద్రం ప్రారంభం

జడ్చర్ల టౌన్, ఫిబ్రవరి 27: జడ్చర్ల కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం జడ్చర్ల అదనపు కోర్డు న్యాయ మూర్తి ముదాసిర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.. వేసవి ఎండల తీవ్రత ఇప్పటికే పెరిగిపోయాయని, బార్ అసోసియేషన్ వారు చలివేంద్రం ఏర్పాటు చేయడంపై వారిని అభినందించారు. కోర్టుకు వచ్చేవారికి దాహార్తిని తీర్చుకోవడం కోసం ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జంగయ్య, సీనియర్ న్యాయవాదులు మాలిక్ షాకీర్, మహేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, యాదిరెడ్డి విశ్వేశ్వర్, అబ్దుల్ కరీం, రమేశ్, సాహితి రెడ్డి, హాజీరావూఫ్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభిస్తున్న జడ్జి ముదాసిర్

టెక్ ఫెస్ట్‌లతో సృజనాత్మకత

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, ఫిబ్రవరి 27: విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకే టెక్ ఫెస్టివల్స్ నిర్వహిస్తున్నట్లు పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌బాబు అన్నారు. గురువారం కళాశాలలో సృజన టెక్ ఫెస్ట్-2024ను ప్రారంభించి మాట్లాడారు. ఇలాంటి ఫెస్ట్‌ల నిర్వహణతో నూతన ఆవిష్కరణలకు అవకాశం ఉంటుందన్నారు. ఉన్నత లక్ష్యాలను నెరవేర్చుకునేలా విద్యార్థులు ముందుకు సాగాలన్నారు. ఫెస్ట్‌ల్లో విద్యార్థులు పాల్గొనడంతో వారిలో నిబిడీకృతమైన నైపుణ్యాలు బయటపడతాయన్నారు. సాంకేతిక నైపుణ్యం భావవ్యక్తీకరణతోనే అద్భుతమైన అవకాశాలు అందిపుచ్చుకోవచ్చన్నారు. ఫెస్ట్‌లో న్యాయనిర్ణేతలు ఎంపిక చేసిన ప్రాజెక్టులు త్వరలో జిల్లా, రాష్ట్ర స్థాయిలో నిర్వహించే పోటీల్లో ప్రదర్శనకు పంపిస్తారన్నారు.

ప్రాజెక్టుల వద్ద ప్రిన్సిపాల్ మోహన్‌బాబు, విద్యార్థులు

ఆజాద్ పోరాట స్ఫూర్తితో ఉద్యమించాలి

నారాయణపేట టౌన్, ఫిబ్రవరి 27: చంద్రశేఖర్ ఆజాద్ ఆశయాలను కొనసాగించాలని పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు గౌస్ అన్నారు. గురువారం పట్టణంలోని మార్కెట్‌లైన్ హైస్కూల్‌లో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో చంద్రశేఖర్ ఆజాద్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. చిన్నతనంలోనే స్వాతంత్ర్యం కోసం పోరాటం చేసిన మహనీయుడు చంద్రశేఖర్ ఆజాద్ అని తెలిపారు. బ్రిటీష్ వారి చేతిలో చావకూడదని తనను తాను కాల్చుకొని వీర మరణం పొందాడన్నారు. నేటి యువత వీరులను ఆదర్శంగా తీసుకొని ప్రజా, విద్యార్థి సమస్యలపై పోరాటం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు సురేశ్, పవన్‌కుమార్, శ్రీనివాస్, శ్రీకాంత్, అరవింద్ పాల్గొన్నారు.

ఆజాద్ ఆశయాలను కొనసాగించాలి

ఊట్కూర్, ఫిబ్రవరి 27 : చంద్రశేఖర్ ఆజాద్‌ను ఆదర్శంగా తీసుకొని యువత పాలక పక్షాల దోపిడీ, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని మండలంలో జిల్లా నాయకులు సురేశ్, పవన్‌కుమార్, శ్రీనివాస్, శ్రీకాంత్, అరవింద్ పాల్గొన్నారు. సీపీఐఎంఎల్ మాస్‌లైన్ పార్టీ గ్రామ కార్యదర్శి మల్లేశ్ పిలుపు నిచ్చారు. మండలంలోని బిజ్వారంలో గురువారం పార్టీ నాయకులు కార్యకర్తలు ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గోవర్ధన్ రెడ్డి, నర్సింహ, తిరుపతి, గోవిందు, ఆశప్ప పాల్గొన్నారు.

పేటలో నివాళులర్పిస్తున్న నాయకులు

బిజ్వారంలో నివాళులర్పిస్తున్న నాయకులు

ఘనంగా రథోత్సవం

● హాజరైన మాజీ ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

రథోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే చిట్టెం

మాగనూర్, ఫిబ్రవరి 27 : మాగనూర్ మండలంలోని వివిధ గ్రామాల్లో మహాశివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వడ్వాట్ గ్రామంలోని శివాలయం వద్ద సాయంత్రం స్వామి వారి రథోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి పాల్గొని శివాలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి రథోత్సవంలో పాల్గొన్నారు. అలాగే మాగనూర్ శివారులో ఉన్న శ్రీరామాలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

ప్రోత్సాహక బహుమతి అందజేత

నారాయణపేట టౌన్, ఫిబ్రవరి 27: మండలంలోని ఎక్లాస్‌పూర్‌కు చెందిన నవనీత రాజ్‌కుమార్, ఉలిగుండంకు చెందిన ప్రియాంక హనుమాన్ దాస్ కులాంతర వివాహం చేసుకున్నారు. ప్రభుత్వం అందించే ప్రోత్సాహక బహుమతికి వారు దరఖాస్తు చేసుకోగా.. ఒక్కో జంటకు రూ.2.50లక్షలు మంజూరయ్యాయి. గురువారం పట్టణంలోని సీవీఆర్ బంగ్లాలో ఎమ్మెల్యే పర్ణికారెడ్డి లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ట్టణంలోని సరాఫ్ బజార్‌లో ఉన్న బాలాజీ మందిరం అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తానని పేర్కొన్నారు. మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ హరినారాయణ భట్టడ్ ఆలయం అభివృద్ధికి రూ.5లక్షలు ఆర్థిక సాయం అందిస్తానని తెలిపారు. బాల్ కిషన్ లాహోటి, బద్రీనారాయణ లాహోటి, రాధా కిషన్ లాహోటి, రాజు లాహోటి, సరిత భట్టడ్, పూజా లాహోటి, బబితా భట్టడ్ వినతిపత్రం ఇచ్చారు.

'నవోదయ' నిర్మాణానికి స్థల పరిశీలన

గండీడ్, ఫిబ్రవరి 27: గండీడ్ మండలానికి నూతనంగా మంజూరైన నవోదయ పాఠశాల భవన నిర్మాణానికి అధికారులు గురువారం స్థలాన్ని పరిశీలించారు. ఆర్డీవో నవీన్ రెవెన్యూ సిబ్బందితో కలిసి మండలంలో పలు ప్రభుత్వ స్థలాలను పరిశీలించారు. మొదట జంగంరెడ్డిపల్లిలో పరిశీలించగా.. అక్కడ అనువైన ప్రదేశం లేకపోవడంతో వర హగిరిపల్లిలో సర్వే నెంబర్ 58లో స్థలాన్ని పరిశీలించి పాఠశాల నిర్మాణానికి అనువుగా ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. వచ్చే ఏడాది నుంచి తాత్కాలికంగా నవోదయ తరగతులు నిర్వహించేందుకు మండల కేంద్రంలో జాగృతి ఎడ్యుకేషనల్ సొసైటీ భవనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో డీటీ మాధవి, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతతోనే ఉన్నతి

మక్తల్, ఫిబ్రవరి 27 : నేటి సమాజంలో ఆర్థిక అక్షరాస్యత కలిగి ఉన్న మహిళలే ఉన్నతి సాధించేందుకు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని నారాయణపేట లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ విజయ్‌కుమార్ అన్నారు. గురువారం మక్తల్ మహిళా సమైక్య భవనంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఎస్‌బీఐ వారి సౌజన్యంతో మహిళ సాధికారతలో భాగంగా ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలను నిర్వహించారు. కార్యక్రమంలో లేట్ డిస్ట్రిక్ట్ మేనేజర్ విజయకుమార్, ఆయా బ్యాంక్ మేనేజర్లు ప్రసన్న కుమార్, మహేశ్, సీఎఫ్ఎల్ కౌన్సిలర్లు రవికుమార్, శశిధర్, అనిత, ఆశకార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, మహిళలు, ఏఎన్ఎం పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

ఊట్కూర్, ఫిబ్రవరి 27: మండలంలోని పగిడిమర్రి గ్రామంలో ఆర్థిక అక్షరాస్యతపై మహిళలకు గురువారం అవగాహన సదస్సును నిర్వహించారు. ఎస్‌బీఐ కోఆర్డినేటర్ చాంద్ సుల్తాన హాజరై సేవింగ్ డిపాజిట్లతో కలిగే లాభాలు, బాలికల సంరక్షణానికి కేంద్రం ప్రవేశపెట్టిన పొదుపు పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఆసిఫా, ఫీల్డ్ అసిస్టెంట్ ఇస్మాయిల్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



ఉపాధ్యాయులైన విద్యార్థులతో అధ్యాపకులు

ఊట్కూ